ఇలా వచ్చి.. అలా!

- గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన
- సర్పంచులు లేక ఇబ్బందులు
- అత్యవసర పనులకే అవకాశం



షాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం

షాబాద్: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. ఫిబ్రవరి 1వ తేదీకే సర్పంచుల పదవీకాలం ముగిసింది. జిల్లాలో 558 గ్రామ పంచాయతీలకు గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులకు స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు అప్పగించారు. సర్పంచుల పదవీ కాలం ముగిసేలోపే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలనవైపే మొగ్గు చూపింది. ప్రత్యేక అధికారులు ఇక నుంచి మాతృశాఖతో పాటు అదనంగా అప్పగించిన పంచాయతీల విధులు కార్యదర్శి భాగస్వామ్యంతో నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాల్సి ఉంది.

సొంత డబ్బు ఖర్చుచేసేవారు

సర్పంచులు పదవిలో కొనసాగినంత కాలం ప్రజాసేవలో వెనుకడుగు వేయకుండా అభివృద్ధి పనుల కోసం సొంత డబ్బు ఖర్చు చేశారు. సర్పంచులు మాజీలైన వారు చేసిన పనులకు ఇంకా ఎంబి రికార్డులు కాలేదని వాపోతున్నారు. బాధ్యతలు తీసుకున్న ప్రత్యేక అధికారులు మాత్రం ప్రభుత్వం డబ్బులు ఇస్తేనే పనులు చేసే అవకాశం ఉంది.

పాలన సవాళ్లే

గ్రామ పంచాయతీల్లో నియమితులైన ప్రత్యేక అధికారులకు పాలన సవాళుగా మారింది. సర్పంచులకు ఉండే పూర్తి బాధ్యతలు ప్రత్యేక అధికారులకు ఉంటాయి. సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలంటే చేయాల్సిన పనులపై అవగాహన కలిగి ఉండాలి. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ, ఎంపీడీఓ, మండల ప్రత్యేకాధికారులతో సమన్వయంతో ప్రతి 15 రోజులు లేదా నెలకోసారి గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుంది. మార్చి నెల వరకు పూర్తి స్థాయిలో అన్ని గ్రామాల్లో ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉంటుంది. కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందిని పురమాయిస్తూ పర్యవేక్షించాల్సి ఉంటుంది. సంత, జాతర వంటి పెండింగ్ టెండర్లు నిర్వహించి, గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంచే బాధ్యత తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తారు. ఈ క్రమంలో వారు పూర్తి బాధ్యతగా వ్యవహరిస్తూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తుంటారు.

జాయింట్ చెక్‌పవర్

ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శికి జాయింట్ చెక్‌పవర్ కల్పించనున్నట్లు అధికారులు వెల్లడించారు. గత సర్పంచుల పదవీ కాలంలో ఉపయోగించిన క్యాష్‌బుక్, చెక్‌బుక్, ఎంబి రికార్డులను పంచాయతీ సెక్రెటరీలు స్వాధీనం చేసుకుని భద్రపరచాల్సి ఉంది. ఇక నుంచి ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శులకు చెక్ పవర్ కొనసాగ నుంది.

ప్రత్యేకాధికారులకు పగ్గాలు...

సర్పంచులు తమ పదవీకాలన్ని పొడిగించాలని కొన్నాళ్లుగా కోరుతున్నారు. చివరకు తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సూపరింటెండెంట్లు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లతో పాటు ఏఈఓలు, ఐకేపీ ఏపీఎంలు, సీసీలు ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రభుత్వ ఆదేశాలతో సర్పంచులు, ఉపసర్పంచుల వద్ద ఉన్న రికార్డులు, స్టాంప్స్, డిజిటల్ కీలను అధికారులు స్వాధీనం చేసుకునే పనిలో ఉన్నారు.ప్రత్యేక అధికారులు గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగు నీరు, పారిశుద్ధ్యం, వీధిదీపాలు, డ్రెయినేజీ తదితర పనులు నిర్వహించాల్సి ఉంటుంది. పెద్ద పనులైతే టెండర్ ద్వారా చేపట్టాల్సి ఉంటుంది.

పదవీ కాలమంతా బాధలే



సర్పంచ్‌గా కొనసాగినంత కాలం బాధలే అనుభవించాం. ప్రజాసేవకు ఏరోజు వెనుకడుగు వేయలేదు. అభివృద్ధి పనులకు సొంత డబ్బు ఖర్చు చేశాం. సకాలంలో బిల్లులు రాక అప్పులపాలయ్యాం. ఇప్పటికైనా సర్పంచులు చేసిన పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి. ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక నిధులు విడుదల చేయాలి.

–తమ్మలి సుబ్రమణ్వేశ్వరి, మాజీ సర్పంచ్, షాబాద్

బాలికల భద్రతే లక్ష్యం

షీ టీం ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం బృందం

షాద్‌నగర్: బాలికలకు సంపూర్ణ భద్రత కల్పించడమే షీటీం లక్ష్యమని ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాయికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏఎస్‌ఐ గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో కాని, బయట కానీ, మరెక్కడైనా సరే ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురి చేసినా, వేధించినా, ఇబ్బంది కరంగా మాట్లాడినా వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. బాలికలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. చదువుల్లో రాణించి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆయన పేర్కొన్నారు. క్రమ శిక్షణతో మెలిగి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం విజయలక్ష్మీ, హెడ్‌కానిస్టేబుల్ బుచ్చయ్య, ప్రహల్లాద్, కృష్ణయ్య, భార్గవి, రేష్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో పాలక వర్గం ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో చేపట్టబోయే పనుల గురించి చర్చించారు. అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు సీసీ రోడ్లు, అండర్‌డ్రైనేజీ పనులు చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. అవసరం ఉన్న వార్డుల్లో శ్మశాన వాటికలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్యంపై ప్రజలు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోతుగల్ డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు

షాబాద్: ఈ నెల 26 నుంచి శ్రీ సూర్యదేవల పర్స్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ పామెన నర్సింహులు, వోల్డ్ ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ జాతీయ అధ్యక్షుడు జాకీషరీఫ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పోతుగల్ గ్రామంలో పీఎస్‌ఆర్ క్రికెట్ గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి డివిజన్ స్థాయి క్రికెట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు మొదటి బహుమతి రూ.1లక్ష నగదుతోపాటు ట్రోఫీ, రెండో బహుమతి రూ.50వేల నగదు అందజేస్తామన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు

ఎంపీడీఓ సంధ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్: గ్రామాల్లోని యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడొద్దని మండల అభివృద్ధి అధికారి సంధ్య అన్నారు. చిలుకూరు, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్, పెద్దమంగళారం, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, చందానగర్, అప్పోజిగూడ, మేడిపల్లి, నాగిరెడ్డిగూడ తదితర గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. చిలుకూరు గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని కొంత మంది మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాషనం చేసుకుంటుందన్నారు. మాదక ద్రవ్యాలు, గుట్కాలు విక్రయించకుండా చూడాలన్నారు. అదే విధంగా పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామ సభల్లో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ వెంకటయ్య పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మాజీ ఉపసర్పంచ్‌లు అంద్రూ, సుధాకర్‌రెడ్డి, జయవంత్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ

షాద్‌నగర్: పదోతరగతి వార్షిక పరీక్షల నేపథ్యంలో గురువారం పట్టణంలోని అభ్యాస్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎం రసూల్ ఆధ్వర్యంలో గణేష్, రమేష్ బృందం అభ్యాస్ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు సంబంధించిన రికార్డులు, క్లాస్ వర్క్స్‌ను పరిశీలించారు. ఇంటర్నల్ మార్కులకు సంబంధించిన రికార్డు తనిఖీ చేసి వివరాలను ఉన్నతాధికారులను నివేదించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా



తహసీల్దార్, ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎంపీపీ

కొత్తూరు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. సమావేశానికి సరైన కోరం హాజరు కానందున సభను వాయిదా వేసినట్లు ఎంపీడీవో అరుంధతి ప్రకటించారు. తిరిగి త్వరలో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. అనంతరం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ రవీందర్‌రెడ్డిలను ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, ఇతర అధికారులు శాలువా కప్పి సన్మానించారు.

ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం రావాలి



విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న సత్యం

కొందుర్గు: ప్రతి విద్యార్థికి చదవడం, రాయడంతోపాటు చతుర్విధ ప్రక్రియలను నేర్పించాలని జీహెచ్‌ఎం సత్యం సూచించారు. సోమవారం ఆయన జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎలికిచర్ల కాంప్లెక్స్ పరిధిలోని జాకారం, పద్మారం తదితర పాఠశాలలను సందర్శించి పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

భారత్ బంద్‌కు సంపూర్ణ మద్దతు

కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినబాక ప్రభాకర్



మాట్లాడుతున్న ప్రభాకర్

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ శుక్రవారం చేపడుతున్న భారత్ బంద్‌కు కార్మిక సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందని రాష్ట్ర కన్వీనర్ పినబాక ప్రభాకర్ తెలిపారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేఖ విధానాలు అవలంభిస్తుందన్నారు. దీంతో కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బడా పారిశ్రామిక వేత్తలకు వత్తాసు పలుకుతూ కేంద్రం నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు కేంద్రం అండగా నిలబడాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రభుత్వం రూపొందించి అమలు చేయాలన్నారు. కార్మికులకు కనీసం నెలకు రూ.26వేతనం చెల్లించాలని, అదేవిధంగా వారి జీవితాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో బంటారం సుధాకర్‌గౌడ్, రాజేష్, భాస్కర్, అశోక్‌రెడ్డి, అంజయ్య యాదవ్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయ సాధనకు కృషి

గిరిజనుల అభ్యున్నతికి పాటుపడిన ఆధ్యాత్మిక గురువు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. గురువారం నియోజక వర్గాల్లో పలు మండలాల్లో, తండాల్లో ఆధ్యాత్మిక గురువు, ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి



కేశంపేట: వేడుకలో పాల్గొన్న ఎంపీపీ రవీందర్‌యాదవ్



షాబాద్: హనుమానాయక్ తండాలో జయంతిలో పాల్గొన్న రవి నాయక్



నందిగామ: సేవాలాల్ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న గిరిజనులు



కొందుర్గు మండలం అయోధ్యాపూర్ తండాలో..

గ్రామ అభివృద్ధిలో సహకారం తప్పనిసరి

రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్



మాట్లాడుతున్న మంజులరవియాదవ్

మొయినాబాద్ రూరల్: గ్రామ అభివృద్ధికి తప్పనిసరిగా సహకరిస్తామని రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్ అన్నారు. గురువారం హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి రాగమ్మ, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంజులరవియాదవ్ మాట్లాడుతూ అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగు నీరు, పారిశుద్ధ్యం, ప్లాస్టిక్ వాడకంపై నిషేధం, విద్యుత్ సమస్య వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ మమత, మాజీ ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, అంగన్‌వాడీ టీచర్లు కవిత, లక్ష్మి, మహిళా సంఘాల అధ్యక్షురాలు పరమేశ్వరి, కోఆప్షన్ సభ్యులు మాల స్వామి, బిస నర్సింహ్మా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దైవ చింతనతో ప్రశాంతత

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్



పోచమ్మ గుడి వార్షికోత్సవంలో కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ పేర్కొన్నారు. గొల్లపల్లి గ్రామంలో గురువారం పోచమ్మ గుడి మూడో వార్షికోత్సవం సందర్భంగా కాంగ్రెస్ పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బండారి ఆగిరెడ్డిలతో కలిసి ఆయన పూజలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు వారివారి పనుల్లో బిజీగా ఉన్నా కూడా దైవభక్తి అలవర్చుకోవాలన్నారు. వారి వెంట మాజీ సర్పంచులు, నాయకులు లొంక శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ కె. నర్సింహ్మారెడ్డి, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పాలనపై నిలదీత



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో దాదు మందిర్ ఎదురుగా మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో రోడ్డంతా జలమయంగా మారింది. గురువారం దాదు మందిర్ సమీపంలో బుర్రకాయల మల్లేశ్ ఇంటి గల్లీని లోకాయుక్త డీఎస్పీ విద్యాసాగర్‌తో పాటు పలువురు అధికారులు పరిశీలించారు. గత 15 రోజుల నుంచి రోడ్డుపై నీరు ప్రవహిస్తుందని ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అక్కడికి వచ్చిన పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని కాలనీ వాసులు నిలదీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వెంటనే సమస్య పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

నేడు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

చేవెళ్ల: బీఆర్‌ఎస్‌ని వీడి చేవెళ్లలో పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాసన్నగారి మానిక్‌రెడ్డి, రేగడిఘనాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు రాఘవీర్‌రెడ్డి(చింటు) తెలిపారు. వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునితామహేందర్ రెడ్డి, ఆమె కుమారుడు పట్నం రినీష్‌రెడ్డిలు గాంధీ భవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు చెప్పారు.

షాబాద్ తహసీల్దార్‌గా ఎండీ అన్వర్



షాబాద్: షాబాద్ తహసీల్దార్‌గా ఎండీ అన్వర్ గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేసిన చిన్న అప్పలనాయుడు నల్గొండ జిల్లా సూర్యాపేట్ ఆర్డీఓ కార్యాలయంలో ఎంఏఓగా వెళ్లాడు. ఇబ్రహీంపట్నంలో విధులు నిర్వహిస్తున్న ఎండీ అన్వర్‌ను షాబాద్ తహసీల్దార్‌గా ప్రభుత్వం నియమించింది.

నేడు రథసప్తమి

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు శ్రీకాంత్, శ్రీపాదులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సప్తవాహన సేవలపై స్వామివారి దర్శనం, పల్లకీ సేవ, ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు



బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

శంకర్‌పల్లి: జనవాడలో దళితులపై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు పేర్కొన్నారు. దాడికి గురై గాయాలపాలైన బాధితులను నగరంలోని ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం జనవాడ గ్రామంలోని చర్చిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, భజరంగ్‌దళ్ నాయకులు కావాలనే, ఉద్దేశ పూర్వకంగానే దళితులపై, క్రైస్తవులపై దాడి చేశారని వారు ఆరోపించారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసులను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు చల్లా శోభన్, చేవెళ్ల డివిజన్ కార్యదర్శి దేవేందర్, అధ్యక్షుడు అరుణ్‌కుమార్, రుద్రకుమార్, కృష్ణ, అశోక్, మల్లారెడ్డి, శ్రీను తదితరలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చేరిక



మాజీ సర్పంచ్ శ్రీధర్‌కు కండువా కప్పుతున్న భీంభరత్

కాంగ్రెస్‌లో చేరిన శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ శ్రీధర్

శంకర్‌పల్లి: ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీంభరత్ పేర్కొన్నారు. గురువారం శంకర్‌పల్లి పార్టీ కార్యాలయంలో శంకర్‌పల్లి మాజీ సర్పంచ్ బీసొళ్ల శ్రీధర్ బీఆర్‌ఎస్ నుంచి పెద్ద ఎత్తున తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా భీంభరత్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా ఎదుగుతుందన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిపుల సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ప్రకాశ్‌గుప్తా, ఎజాస్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.